

పండావీధిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్



ప్రచారం మధ్య మండుటెండలో దాహం తీర్చుకుంటూ...



జ్ఞానాపురం మార్కెట్‌లో ప్రచారం చేస్తున్న ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి

అభివృద్ధి అజెండా.. సంక్షేమమే మది నిండా

- 35వ వార్డులో ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి ప్రచారం
- అడుగడుగునా హారతులిచ్చిన మహిళలు
- ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించిన గణేష్‌కుమార్

దక్షిణలో ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ నాల్గవ రోజు ప్రచారం భారీ స్థాయిలో కొనసాగింది. పార్టీ శ్రేణులు, అభిమానుల కోలాహలం నడుమ వాసుపల్లి నియోజకవర్గంలో ప్రజలను కలుసుకున్నారు. వారిని ఆప్యాయంగా పలకరించి.. బాగోగులు తెలుసుకున్నారు. సమస్యలపై ఆరా తీశారు. మరోమారు వైఎస్సార్‌సీపీని గెలిపించి.. మరింత మేలు చేసే అవకాశం కల్పించాలన్నారు.

జగదాంబ : ప్రజాభిమానమే వైఎస్సార్‌సీపీని గెలిపిస్తుందని ఆ పార్టీ దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 35వ వార్డు పార్టీ ఇన్‌చార్జి అలవన కనకరెడ్డి ఆధ్వర్యంలో నాల్గవ రోజు వాసుపల్లి గణేష్‌కుమార్, ఎన్నికల పరిశీలకులు ద్రోణంరాజు శ్రీవత్సవ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పండావీధి, చిన దుర్గాలమ్మవీధి, ప్రసాద్‌గార్డెన్స్, మేదరవీధి, వెలంపేటలో ఈ ప్రచారం కొనసాగింది. ఈ సందర్భంగా వాసుపల్లి కులవృత్తిదారులతో మాట్లాడారు. జగనన్న చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం గురించి వారితో చర్చించారు. పండా వీధిలో దివ్యాంగులతో మాటామంతీ కలిపారు. మేదర వీధిలో తట్టలల్లుతున్న వారి కష్టం తెలుసుకున్నారు. రజకులతో మాట్లాడుతూ దుస్తులు ఇస్త్రీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బొత్స ఝన్సీలక్ష్మిని గెలిపించాలని కోరారు. ఇప్పటి వరకు ప్రజా ప్రతినిధిగా ఏనాడూ ఇంట్లో లేనని ప్రజల మధ్యనే ఉన్నానని గుర్తు చేశారు. ఎవరినీ ఇంటికి రప్పించుకున్న రోజులు లేవన్నారు. ప్రతి ఒక్కరి ఇంటికి తానే వెళ్లానన్నారు. నియోజకవర్గంలో ఎవరికి కష్టం వచ్చినా తక్షణం సాయపడ్డానని తెలిపారు. విద్యార్థులకు ఫీజులు కట్టడంలో గానీ, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు తగ్గించే విషయంలో యాజమాన్యాలతో మాట్లాడటం వంటి సహకారం అందించానన్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే నియోజకవర్గమే తన ఇంటిగా భావించి ప్రజల యోగక్షేమాలకు నిరంతరం కృషి చేశానన్నారు. అనంతరం ఎన్నికల పరిశీలకులు శ్రీవత్సవ్ మాట్లాడుతూ దక్షిణలో వాసుపల్లి గెలుపు ప్రచారంలోనే కనబడుతుందన్నారు. ప్రజల ఆదరణ చూస్తుంటే అత్యధిక మెజారిటీ వస్తుందనిపిస్తుందని తెలిపారు. అందరం కలిసి వాసుపల్లి గెలుపునకు కష్టపడదామన్నారు.



మేదర వీధిలో తట్టలల్లుతూ..

న్యూహోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌లో..

కంచరపాలెం : కాన్వెంట్ కూడలిలో గల న్యూహోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌కు ప్రత్యామ్నాయంగా పదెకరాల స్థలం కేటాయించి, వ్యాపారుల సమస్యలు పరిష్కరిస్తామని వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ హామీ ఇచ్చారు. మార్కెట్‌లో శనివారం జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా లక్ష్మీగణపతి ఆలయంలో బొత్స ఝాన్సీ, వాసుపల్లి గణేష్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. వీరికి కోడిగుడ్ల పూర్ణిమ, శ్రీధర్, హోల్‌సేల్ మార్కెట్ వర్తక సంఘం సభ్యులు శాలువ కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేశారు. అనంతరం వ్యాపారులను, కలాసీలను ఆప్యాయంగా పలకరిస్తూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. ప్రతి దుకాణానికి వెళ్లి కలాసీల కష్టసుఖాలు అడిగి తెలుసుకున్నారు. ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ మాట్లాడుతూ కార్మిక, కర్షక, ఆటోడ్రైవర్లకు రూపాయి అవినీతి లేకుండా సంక్షేమ ఫలాలు అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. మీ అమూల్యమైన ఓటును ఫ్యాన్ గుర్తుపై వేసి నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న గణేష్‌కుమార్‌ను, ఎంపీగా తనను అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి మాట్లాడుతూ హోల్‌సేల్ వర్తకులతో తనకు సత్సంబంధాలు ఉన్నాయని, వారి సమస్యలు పరిష్కరించేందుకు ఎంతగానో కృషి చేశానన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు ద్రోణంరాజు శ్రీవత్సవ్, పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ జహీర్ అహ్మద్, మాజీ కార్పొరేటర్లు ఉమామహేశ్వరరావు, గరికిన గౌరీ, పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్, వర్తక సంఘ ప్రతినిధులు కె. వీర్రాజు, విల్లూరి పరమేశ్వరరావు, పి.సత్యనారాయణ, ఆర్ రాంబాబు, ఆలయ చైర్మన్ కోరిబిల్లి ప్రసాద్, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ప్రసాద్‌గార్డెన్స్‌లో వికలాంగుడిని అక్కున చేర్చుకున్న వాసుపల్లి గణేష్‌కుమార్

ఈ ఎన్నికల తర్వాత ప్రతిపక్షం కనుమరుగు

గత ఎన్నికల్లో టీడీపీకి కనీసం 23 సీట్లు అయినా వచ్చాయని.. ఈ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో ప్రతిపక్షమే ఉండదని వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డిపై పోరాటం చేసే నాయకులే లేరన్నారు. చంద్రబాబుకు వయసు సహకరించడంలేదన్నారు. మిగిలిన నాయకుల కోసం మాట్లాడటం అనవసరం అన్నారు. పార్టీ పెట్టి 20 సీట్లతో పోటీ చేస్తున్న నాయకుడి కోసం మాట్లాడటం సమయం వృథా అంటూ ఎద్దేవా చేశారు. జగనన్న సిద్ధం పేరుతో ఏర్పాటు చేసిన సభలు చూసి ప్రతిపక్షానికి మాటలు రావడం లేదన్నారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా జగనన్న గెలుపు తథ్యమన్నారు. మరో 20 సంవత్సరాలు జగన్‌మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గరికిన గౌరి, వార్డు నాయకులు ఆదివిష్ణురెడ్డి, సుబ్రహ్మణ్యం, గంగాధర్, పుష్ప, రమణమ్మ, గండిబోయిన రమణ, రూప, వార్డు నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



చిన దుర్గాలమ్మ వీధిలో వాసుపల్లికి పూలమాల వేస్తున్న మహిళలు

క్లుప్తంగా

వాసుపల్లికి నాగవంశీయుల మద్దతు



వాసుపల్లిని గజమాలతో సత్కరిస్తున్న కనకల ఈశ్వర్ తదితరులు

డాబాగార్డెన్స్: దక్షిణలో వాసుపల్లి గణేష్‌కుమార్‌కు మద్దతుగా వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేస్తామని 29వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ కనకల ఈశ్వర్ అన్నారు. ఆశీల్‌మెట్ట అశోక్‌నగర్‌లో గల వాసుపల్లి కార్యాలయంలో రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీతో కలిసి వాసుపల్లిని గజమాలతో సత్కరించారు. నాగవంశీయులంతా వాసుపల్లి వెంటే ఉంటామని, నియోజకవర్గంలో సుమారు 2500 మంది నాగవంశీయ కుటుంబాలన్నీ ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి వాసుపల్లిని అఖండ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. కార్యక్రమంలో గుమ్మడి చంద్రమౌళి, సుబ్బారెడ్డి, శివ, బులిరెడ్డి, గొలగాని శివ, రాము, కనక కిషోర్, మేడిశెట్టి రూప, వెంకటేష్, బాబులు తదితరులు పాల్గొన్నారు.

జోన్-4లో రూ. 1. 80 కోట్ల పన్ను వసూలు



సెక్రటరీలతో కలిసి పన్ను వసూలు చేస్తున్న జెడ్సీ ప్రసాదరావు

జగదాంబ : వడ్డీ లేకుండా పన్ను బకాయిలు చెల్లించుకోవాలని జోన్-4 జెడ్సీ పీవీవీడీ ప్రసాదరావు అన్నారు. ఈనెల 31వ తేదీతో రాయితీ గడువు ముగిసిపోతుందన్నారు. ఇంకా ఒక్క రోజు మాత్రమే గడువు ఉందన్నారు. ఆదివారం అయినప్పటికీ పన్ను చెల్లింపులకు జీవీఎంసీలో సౌకర్యం కేంద్రం తెరిచే ఉంటుందన్నారు. ఇదిలా ఉంటే శనివారం పన్ను చెల్లింపునకు ప్రజలు ఎగబడ్డారు. దీంతో రూ. 1.80 కోట్ల ఆస్తి, నీటి పన్ను వసూలైంది.

రైల్వే నుంచి రూ.2.58 కోట్ల పన్ను వసూలు



పన్ను వసూలు రసీదుని జోన్-5 కమిషనర్ కృష్ణకు అందిస్తున్న ఆర్వోలు

కంచరపాలెం: జీవీఎంసీ జోన్-5కు రైల్వే నుంచి రూ.2.58 కోట్ల ఆస్తి పన్ను వసూలు అయినట్లు అసిస్టెంట్ కమిషనర్లు (రెవెన్యూ) బాబూరావు, రాజ్యలక్ష్మి తెలిపారు. శనివారం విశాఖ రైల్వే నుంచి పెద్ద మొత్తంలో ఆస్తి పన్ను వసూలు చేసి జ్ఞానాపురంలోని కార్యాలయంలో జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణకు అందజేశారు. రెవెన్యూ సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ నెల 31వ తేదీ రాత్రి 7 గంటల వరకు ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 5 శాతం రాయితీతో ఇంటి పన్ను చెల్లించవచ్చని, పన్నుదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆర్వోలు కోరారు.

ఓటు విలువపై అవగాహన కార్యక్రమాలు



మాట్లాడుతున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

మహారాణిపేట : ఓటు విలువపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పశ్చిమ ఆర్వో, విశాఖ రెవెన్యూ డివిజనల్ అధికారి డి.హుస్సేన్ సాహెబ్ అన్నారు. శనివారం కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఆర్డీవో కార్యాలయంలో సిస్టమెటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్(ఎస్‌వీఈఈపీ) బృందాలు, పశ్చిమ నియోజకవర్గ సభ్యులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలో అన్ని బూత్‌లలో నూరు శాతం ఓట్లు పోలయ్యే విధంగా ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ రామారావు పాల్గొన్నారు.

రూపాకుల విశాలాక్షి సేవలు మరువలేనివి

మహారాణిపేట : రూపాకుల విశాలక్షి స్వాతంత్ర్య ఉద్యమంలో అంటరానితనం నిర్మూలనకు విశేషంగా కృషి చేశారని మిజోరం గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు అన్నారు. శనివారం మహారాణిపేట ప్రకృతి చికిత్సాలయంలో శ్రీ గాయత్రీ వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ, రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన రూపాకుల విశాలాక్షి 98వ జయంతికి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 1946లో హరిజనులను తిరుపతి ఆలయ ప్రవేశం చేయించేందుకు ఉద్యమం నిర్వహించి సఫలీకృతులయ్యారని అన్నారు. ఈ సందర్భంగా వైద్యులు గోసాల చిట్టి పంతులు, ఎన్ఎఎన్ మూర్తి, టి. రవిరాజు, జి. వెంకటేశ్వరరెడ్డి, కరుణాకరపాదే, టి. రాధ తదితరులను ఘనంగా సత్కరించారు. ప్రకృతి వైద్య నిపుణులు డాక్టర్ శిష్టా లక్ష్మీనారాయణ, శిష్టా శ్రీలక్ష్మి, రూపాకుల రవికుమార్, బీజేపీ నాయకులు ఎస్‌వీఎస్ ప్రకాష్‌రెడ్డి, కృష్ణకుమార్, రమణ, హుస్సేన్, బాబూరావురెడ్డి, రామనాయుడు, శ్యాంకోటి, చొక్కాకుల రాంబాబు తదితరులు విశాలాక్షికి ఘన నివాళులు అర్పించారు.



డాక్టర్ చిట్టి పంతులును సత్కరిస్తున్న మిజోరం గవర్నర్ డాక్టర్ హరిబాబు

బాలిక బలవన్మరణంపై విచారణ

మహారాణిపేట : కొమ్మాది శ్రీ చైతన్య కళాశాలలో లైంగిక వేధింపులకు గురై ఆత్మహత్యకు పాల్పడిన మైనర్ బాలిక తల్లిదండ్రులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు మాట్లాడి వారిని ఓదార్చారు. శనివారం జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యులతో కలిసి కేజీహెచ్ పోస్టుమార్టం విభాగం వద్ద వారిని కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ ఆదర్శంగా ఉండాల్సిన ఉపాధ్యాయులే లైంగిక వేధింపులకు గురి చేయడం దురదృష్టకరం అన్నారు. ఈ విషయంలో విద్యా సంస్థలు కూడా బాధ్యతగా ఉండాలన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు, కట్టుదిట్టమైన భద్రత కల్పించాలన్నారు. అలాగే బాలలు కూడా తాము ఎదుర్కొంటున్న సమస్యలను నిర్భయంగా ఉన్నతాధికారులు, తల్లిదండ్రుల దృష్టికి తీసుకు రావాలన్నారు. సంఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి తుది నివేదికను త్వరితగతిన కమిషన్‌కు సమర్పించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యురాలు రజని, విజయలక్ష్మి, జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారి బి.హెచ్. లక్ష్మి, సిబ్బంది ఆనంద్, వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది శరణ్య తదితరులు పాల్గొన్నారు.



బాలిక బంధువులతో మాట్లాడుతున్న కేసలి అప్పారావు

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చన లో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి.శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంసెట్, నీట్, పాలిసెట్ ప్రవేశ పరీక్షలకు ఉచిత శిక్షణ

డాబాగార్డెన్స్ : ఎంసెట్, నీట్, పాలిసెట్ ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు శ్రీసత్యసాయి సేవా సంస్థల రైల్వే ఏరియా సమితి నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ఎంసెట్, నీట్ ప్రవేశపరీక్షకు సంబంధించి ఈ నెల 24 నుంచి ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయని, పాలిసెట్‌కి సంబంధించి ఏప్రిల్ ఒకటి నుంచి ఉచిత తరగతులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. శిక్షణ తరగతులు శ్రీసత్యసాయి సేవా సంస్థలు, సాయి సౌధ మందిరం, రైల్వే ఏరియా సమితి, పోర్టు స్టేడియం ఎదురుగా, అక్కయ్యపాలెం, ఎన్‌జీజీవోస్ కాలనీలో ఉంటాయని చెప్పారు. రిజిస్ట్రేషన్, మరిన్ని వివరాలకు 9248052173, 6300366227 నంబర్లలో సంప్రదించాలన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి జనసేన, టీడీపీ నేతలు



తోట పద్మావతి ఆధ్వర్యంలో పార్టీలో చేరిన యువకులు



గరికిన గౌరి ఆధ్వర్యంలో పార్టీలో చేరిన మహిళలు

అల్లిపురం : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి ఆధ్వర్యంలో 50 మంది మహిళలు, 100 మంది యువకులు పార్టీలో చేరగా, వారికి వాసుపల్లి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వీరంతా బుడ్డి ధనరాజు నేతృత్వంలో పార్టీలో చేరారు. అలాగే వార్డు మాజీ కార్పొరేటర్ గరికిన గౌరీ ఆధ్వర్యంలో ఎస్.మనోహర్ నేతృత్వంలో వంద మంది జనసేన, టీడీపీకి చెందిన మహిళలు వైఎస్సార్‌సీపీలో చేరారు. కండువాలు కప్పి వారిని వాసుపల్లి పార్టీలోకి ఆహ్వానించారు.

ఉద్యోగుల సేవలు ఎనలేనివి

అల్లిపురం : విధి నిర్వహణలో ప్రజలు, ప్రభుత్వానికి ఎన్నో సేవలందించిన ఉద్యోగుల సేవలు ఎనలేనివని, వారు పదవీ విరమణ అనంతరం శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని జీవీఎంసీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి.పద్మజ అన్నారు. శనివారం ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో పదవీ విరమణ చేసిన ఉద్యోగులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదవీ విరమణ చేసిన ఉద్యోగులు ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎంఈఎస్ఏ, జెమ్స్ అధ్యక్షుడు అప్పలనాయుడు, కార్యవర్గ సభ్యులు అప్పలరాజు, పర్యవేక్షకులు రియాజ్, నరసింగరావు, శ్రీనివాసరావు, సన్నీతో పాటు పదవీ విరమణ చేసిన ఉద్యోగులు నారాయణ, సూరిబాబు, వెంకట కృష్ణారెడ్డి, అప్పారావు, వారి కుటుంబ సభ్యులు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.



పదవీ విరమణ చేసిన ఉద్యోగులతో జీవీఎంసీ ఏవో పద్మజ తదితరులు

పింఛన్ల పంపిణీ నిర్ణయంపై పునఃపరిశీలించాలి

విశాఖ లీగల్: వలంటీర్ వ్యవస్థపై చంద్రబాబు నాయుడు, మాజీ ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ ఫిర్యాదుపై పలువురు న్యాయవాదులు విస్మయం చెందారు. పేద, బడుగు బలహీన వర్గాలు,వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి నెలనెలా ఒకటో తేదీన పెన్షన్లు అందిస్తు వారికి ఆసరాగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేయొద్దని ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. దీనికి సంబంధించి సీనియర్ న్యాయవాది వి. కాళిదాసు రెడ్డి మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ అతి ప్రాచీనమైనదని పేర్కొన్నారు. 1977లో అప్పటి జనతా ప్రభుత్వం దేశవ్యాప్తంగా వలంటీర్ల ద్వారా ఆరోగ్య, సామాజిక సేవలు అందించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. సామాజిక కార్యకర్త పేరుతో గ్రామాల్లో ప్రభుత్వ, వైద్య సేవలు, అందించడానికి ఈ వలంటీర్ వ్యవస్థ ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ఈ సేవలను మళ్లీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పునర్ వ్యవస్థీకరించి ప్రభుత్వ పథకాలు నేరుగా ప్రజలకు అందే విధంగా చర్యలు తీసుకున్నారని చెప్పారు. లక్షలాదిమంది వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బంది పడే అవకాశం ఉన్న దృష్ట్యా ఎన్నికల కమిషన్ తమ నిర్ణయాన్ని పునః పరిశీలించాలని కాళిదాసు రెడ్డి కోరారు.



న్యాయవాది కాళిదాసురెడ్డి

ఉత్సాహంగా 'రన్ ఫర్ జీసస్'

తాటిచెట్లపాలెం: విశాఖ ఉత్తర ప్రాంత క్రైస్తవ సమితి ఆధ్వర్యంలో శనివారం రన్ ఫర్ జీసస్ (క్రైస్తవ శాంతి ర్యాలీ) ఉత్సాహంగా నిర్వహించారు. తాటిచెట్లపాలెం హైవే వద్ద నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీని నియోజకవర్గంలోని పలువురు పాస్టర్లు ప్రార్థనలతో ప్రారంభించారు. తాటిచెట్లపాలెం, కైలాసపురం, కస్తూరి నగర్, బాబూజీనగర్, బర్మాక్యాంప్, ఊర్వశి జంక్షన్, కంచరపాలెం ప్రాంతాల మీదుగా సంజీవయ్య కాలనీ వరకు ర్యాలీ సాగింది.

5న జాప్ ఉగాది సంబరాలు

డాబాగార్డెన్స్: జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ (జాప్) ఆధ్వర్యంలో వచ్చే నెల 5న అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఉగాది సంబరాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు యూనియన్ నాయకులు శనివారం జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మను కలిసి ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో జాప్ అధ్యక్షుడు సింగంపల్లి శ్రీనివాస్, యూనియన్ ప్రధాన కార్యదర్శి కీర్తన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్.శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు పాల్గొన్నారు.



కమిషనర్ సాయికాంత్ వర్మకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న జాప్ నాయకులు

దివ్యాంగుల పాఠశాలకు చేయూతనివ్వండి

డాబాగార్డెన్స్ : పెదవాల్తేర్, మధురవాడలో సన్‌ఫ్లవర్ ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ సొసైటీ గత 37 ఏళ్లుగా నడుపుతున్న దివ్యాంగుల స్కూళ్లలో మౌలిక సదుపాయాల కల్పనకు దాతలు సహకరించాలని సొసైటీ వ్యవస్థాపకురాలు ఎంఎస్ కుమారి విజ్ఞప్తి చేశారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మూగ, చెవుడు, బుద్ధిమాంద్యం కలిగిన పిల్లలు, ఆర్టిజం, డౌన్ సిండ్రోమ్, ఏడీహెచ్‌డీ తదితర సమస్యలతో వచ్చిన పిల్లలు, పేద పిల్లలు, తల్లిదండ్రులు లేని పిల్లలకు హాస్టల్ వసతి, డే స్కాలర్ పిల్లలకు బస్సు సదుపాయం కల్పిస్తున్నట్టు తెలిపారు. 120 మంది విద్యార్థులు (దివ్యాంగులు) గల ఈ స్కూల్లో స్థలాభావం వల్ల సంపూర్ణ శిక్షణ అందజేయలేకపోతున్నామని, అవసరమైన మౌలిక సదుపాయాలు ఉన్నట్టయితే ఎంతో మందికి శిక్షణ కల్పించగలమన్నారు. సమావేశంలో ఎంపీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.